

మా ప్రతి గుండెలోనూ వైఎస్సార్

ప్రతి మైనార్టీ గుండెలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కొలువై ఉన్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు.

- 8లో..



సాంకేతిక విద్యా నైపుణ్యాలకు పెద్దపీట

సాంకేతిక విద్యా నైపుణ్యాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
43.4 /33

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికం.

న్యూస్‌రీల్

యోగా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



యోగా దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఈ నెల 21వ తేదీ 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ఏబీఎం కాలేజి క్రీడా మైదానంలో నిర్వహించే కార్యక్రమాలపై ఆయుష్ శాఖ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ దినేష్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఆయుష్ ఆర్‌డీడీ డాక్టర్ పద్మజాతి, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్‌లు ఉమాపతి చౌదరి, ప్రకాష్ చవల, అనిల్ కుమార్, అనపర్తి శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ ఎంకె బాష, లయన్స్ క్లబ్ సభ్యులు నిమ్మగడ్డ వెంటేశ్వరరావు, ఆయుష్ శాఖ వైద్యులు పాల్గొన్నారు.

నేడు వసతి గృహాల ఉద్యోగుల సంఘ ఎన్నికలు

ఒంగోలు: ప్రకాశం జిల్లా సంక్షేమ శాఖలైన సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక భాగ్యనగర్ నాలుగోలైను వద్ద ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో ఈ ఎంపిక ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, జిల్లా కార్యవర్గ సభ్యుల ఎంపిక ఉంటుందని, ఆసక్తి గలవారు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పిల్లలను అలరించే వనగోపాలుడు



వనగోపాలుడు గ్రంథావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: కులమత భేదాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు రచించిన వనగోపాలుడు నేటి తరానికి అవసరమైన గ్రంథమని ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం సాయంత్రం వనగోపాలుడు, వసుధ శతకం గ్రంథాలను ఆవిష్కరించారు. సభకు తెలుగు లోగిలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమరావు అధ్యక్షత వహించారు. వృత్తి పరంగా హిందీ పండితుడైన పబ్బిశెట్టి మాతృభాష మీద అనురక్తితో చక్కటి తెలుగులో దైవభక్తి, దేశభక్తి కలగలసిన రచనలు చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. వర్తమాన సమాజంలో తరిగిపోతున్న మానవతా విలువలను పెంపొందించేందుకు సాహితీవేత్తలు రచనలు చేయాలని నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ కోరారు. వనగోపాలుడు నేటి తరం విద్యార్థులకు ఉపకరిస్తుందన్నారు. సామాజిక లక్ష్యంతో చేసిన రచనలు ఎప్పటికీ నిలిచిపోతాయని నాగభైరవ సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ చెప్పారు. వనబాలుడు, వసుధ శతకం పుస్తకాలను మద్దిరాల శ్రీనివాసులు, సింహాద్రి జ్యోతిర్మయి విశ్లేషించారు. ఈ సభలో కుర్రా ప్రసాదబాబు, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, మిడసల మల్లికార్జునరావు, శనగపల్లి సుబ్బారావు, బీరం అరుణ, ఉదయజానకి, అంగలకుర్తి ప్రసాద్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాల కోసం వచ్చిన వారిలో నైపుణ్యాన్ని అంచనా వేసిన తర్వాతే కంపెనీలు అవకాశాలు కల్పిస్తున్నాయి.. జాబ్‌మేళాలకు వస్తున్న యువతీ యువకులకు సరైన వృత్తి నైపుణ్యాలు లేక కొలువుల సాధనలో వెనుకబడుతున్నారు. ఇది గమనించిన రాష్ట్ర ప్రభుత్వం యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సులభంగా పొందేందుకు ఇంటర్ స్థాయి నుంచే నైపుణ్య శిక్షణలు ఇస్తోంది. కలల కొలువు సాధించే దిశగా చేయూతనిస్తోంది.

నైపుణ్యంతోనే కలల కొలువులు

- ఇంటర్మీడియెట్‌తోనే ఉద్యోగం
- హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ద్వారా ఏర్పాట్లు
- సాఫ్ట్‌వేర్ రంగంలో అద్భుత అవకాశాలు
- ఎంపికైతే ప్రారంభం నుంచే మంచి జీతాలు
- హెచ్‌సీఎల్‌లో శిక్షణకు మూడు ప్రాంతాల్లో ఎంపికలు
- 17 నుంచి 19 వరకు రెవెన్యూ డివిజన్లలో నిర్వహణ
- జిల్లా నైపుణ్య శిక్షణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాలో వృత్తి నైపుణ్య శిక్షణలు నిరుద్యోగ యువతకు ఇస్తూ యువత సొంత కాళ్లపై నిలబడేలా ఉపాధి చూపుతోంది. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తోంది. ప్రత్యేకంగా ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల కోసం జిల్లా వ్యాప్తంగా ఎంపిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా హెచ్‌సీఎల్ టెక్ బీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. అందుకుగాను హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో హెచ్‌సీఎల్ టెక్ బీ కెరీర్ ప్రోగ్రాంకు సంబంధించి ఆన్‌లైన్ పరీక్షతో పాటు ఇంటర్వ్యూలు కూడా నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంపిక ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. అందుకోసం వరుసగా జిల్లాలో ఈ నెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఎంపిక, ఇంటర్వ్యూల ప్రక్రియలు చేపట్టారు.

- శనివారం కనిగిరిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు.
- 18 న ఉదయం 10 గంటలకు శ్రీ హర్షిణీ డిగ్రీ కాలేజ్, ఒంగోలులో..
- 19 న ఉదయం 10 గంటలకు డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇంజినీరింగ్ కాలేజి, మార్కాపురంలో నిర్వహిస్తారు.

ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ గ్రాడ్యుయేషన్ పూర్తయిన వారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలు పొందుతారు. అది ఒక ఎత్తయితే కేవలం ఇంటర్ పూర్తయిన వారికి సైతం సాఫ్ట్‌వేర్ స్థాయి కొలువులు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్లను ఆదేశించారు. 12వ తరగతిలో లెక్కలు లేదా బిజినెస్ మ్యాథ్స్ 2022వ సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణతతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన ఏ గ్రూపు అభ్యర్థులైనా అర్హులే. అదేవిధంగా 2023 సంవత్సరంలో 75 శాతం ఎక్కువ ఉత్తీర్ణతతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు కూడా ఐటీ రంగంలో తమ కెరీర్‌ను ప్రారంభించాలనుకుంటే వారికి కూడా అవకాశాలు కల్పిస్తున్నారు. అర్హులైన అభ్యర్థులంతా ముందుగా హెచ్‌సీఎల్ టెక్‌బీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంది. జిల్లాలో ఉన్న వనరులు, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని యువతకు జిల్లాలోనే ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ చర్యలు చేపట్టారు. ఆ మేరకు ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లాలో కార్యాచరణ చేపట్టారు. జిల్లాలో 14 రంగాల్లో వివిధ రకాల నైపుణ్య శిక్షణలు ఇస్తున్నారు. గతంలో జిల్లా కేంద్రంలో ఒకే ఒక స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ సెంటర్‌ను ప్రారంభించి స్థానిక యువతకు శిక్షణ పొందేలా చక్కటి అవకాశం కల్పించింది. దీంతో నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్య శిక్షణల వైపు ఆసక్తి చూపుతున్నారు.



కనిగిరిలో నిర్వహించిన నైపుణ్య శిక్షణలో పాల్గొన్న యువతీ, యువకులు

యువత నైపుణ్యం పెంచుకుని ఉపాధి పొంది



జిల్లాలో యువత ఉద్యోగాల అన్వేషణతో సరిపెట్టుకోకుండా నైపుణ్యం పెంచుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి. హెచ్‌సీఎల్ టెక్ బీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోలేకపోయిన అభ్యర్థులు కూడా జిల్లాలో కనిగిరి, ఒంగోలు, మార్కాపురంలలో నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షకు హాజరుకావచ్చు. జిల్లాలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన అభ్యర్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలి. నైపుణ్య శిక్షణే కాకుండా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విరివిగా కల్పిస్తున్నాం.

– ఏఎస్.దినేష్‌కుమార్, కలెక్టర్

పరీక్ష అనంతరం శిక్షణతోపాటు ఉపాధి..



జిల్లాలో యువతకు నైపుణ్య శిక్షణలతో పాటు ఉపాధి కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. హెచ్‌సీఎల్ టెక్ బీ ద్వారా నిర్వహించే ఈ కార్యక్రమం వివరాలు ముందుగా తెలియని వారు కేంద్రాలకు సంబంధించిన ఫోన్ నంబర్లు ఇస్తున్నాం. ఫోన్ చేసి వివరాలు తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలి. కనిగిరి సెంటర్ సెల్: 8008986256, ఒంగోలు సెంటర్ సెల్: 6301006979, మార్కాపురం సెంటర్ సెల్: 9949914337 నంబర్లను సంప్రదించాలి.

– ఆర్.లోకనాథం, ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి

మాలకొండ స్వామిని దర్శించుకున్న కలెక్టర్



దర్శనానంతరం కలెక్టర్ కుటుంబ సభ్యులు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసిన మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానాన్ని శనివారం ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఆయన సతీమణి ఐఏఎస్ అధికారిణి విజయకృష్ణన్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక వారి కుటుంబ సభ్యులతో పాటు దర్శించుకున్నారు. ముందుగా ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు వారికి స్వాగతం పలకగా, ఆలయ ప్రధాన అర్చకుడు గౌరిశంకర్ వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆలయ వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉందని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది పడకుండా చూస్తున్నారని కొనియాడారు. అన్నదాన ప్రసాదాలు నిర్వహించడం చాలా అభినందనీయమని అన్నారు.

నేడు ఎంఈవో 2 పోస్టుకు కౌన్సెలింగ్

ఒంగోలు: జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులకు రెండో మండల విద్యాశాఖ అధికారి పోస్టుకు సంబంధించి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సంయుక్త సీనియార్టీ జాబితాను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోప్రకాశం.కో.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. సంయుక్త సీనియార్టీపై ఏవైనా అభ్యంతరాలుంటే ఆదివారం మధ్యాహ్నం 12 గంటల్లోగా రాతపూర్వకంగా సంబంధిత పత్రాలు, సర్వీస్ రిజిస్టర్ జతపరిచి డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న మండల విద్యాశాఖ అధికారులంతా తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని, హాజరుకానివారికి ఇన్ ఆబ్సెంటియా ఉత్తర్వులు ఇస్తారన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు
- పేద విద్యార్థులను ప్రోత్సహించటమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా ఆర్థికంగా ప్రోత్సాహం
- ఒంగోలులో జిల్లా స్థాయి అవార్డు ప్రదానోత్సవం
- ముఖ్య అతిథులుగా బాలినేని, ఆదిమూలపు హాజరు



మెడల్, ప్రశంస పత్రాలు, నగదు పురస్కారం అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సబర్బన్: జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం ఒంగోలులోని పీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలల విషయంలో తీసుకుంటున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి వివరించారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పాఠశాల, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. మంచి ప్రతిభ కనబరిచిన వారికి రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.15 వేలు ఇచ్చి ప్రోత్సహించటం దేశ చరిత్రలోనే లేదన్నారు. తద్వారా చిన్నారులను, వారి తల్లిదండ్రులను కూడా ప్రోత్సహించినట్లు అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, గురువులను కూడా సన్మానించటం గొప్ప కార్యక్రమంగా అభివర్ణించారు. విద్యా విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచనలు ఏ ముఖ్యమంత్రి చేయటం లేదన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు విద్యార్థులతో సమానంగా ర్యాంకులు తెచ్చుకుంటున్నారంటే అది సీఎం వైఎస్ జగన్ చలువేనని కీర్తించారు.

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇలాంటి పురస్కారాలు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువులో రాణించేందుకు అవసరమైన అన్ని పథకాలను సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ సీఎం వైఎస్ జగన్ మేనమామగా బాధ్యతలు తీసుకున్నారని కీర్తించారు.

కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవటానికి అవసరమైన అన్ని సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి ఉన్నతమైన కార్యక్రమాన్ని చేపట్టిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారికి అవార్డులను, ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ సుభాన్‌బీ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, ఆర్‌ఐఓ సైమన్ విక్టర్, కార్పొరేటర్లు ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, బేదంశెట్టి శైలజతో పాటు పలువురు పాల్గొన్నారు.



పదో తరగతిలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థినికి ప్రశంస పత్రం అందజేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేష్, బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్

టిడ్కో ఇళ్ల పేరుతో వంచించిన టీడీపీ

- ఇళ్లు మంజూరు కాకుండానే డబ్బులు కట్టించుకొని మోసం
- ఆ డబ్బులు ఏం చేశారో దామచర్ల జనార్దన్ ప్రజలకు చెప్పాలి
- ఒక్కొక్కరి వద్ద రూ.75 వేలు కట్టించుకొని ఇళ్లు కట్టించకుండా చేతులెత్తేసిన టీడీపీ ప్రభుత్వం
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ధ్వజం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: టిడ్కో ఇళ్ల పేరుతో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలను నిలువునా మోసం చేశారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు. అసలు ఇళ్లు మంజూరు కాకుండానే ప్రజల వద్ద నుంచి డబ్బులు ఎలా కట్టించుకున్నారని నిలదీశారు. ఒంగోలు నగరంలోని 5వ డివిజన్‌లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని శ్రీనివాస రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గోపాల్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లోని గడ్డి కయ్యల ఏరియాలో పర్యటించారు. తొలుత మసీదులో ప్రత్యేకంగా ప్రార్థనలు చేసిన బాలినేని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో ప్రజలను నిలువునా వంచించిన చరిత్ర ఆ పార్టీ నాయకులదని ధ్వజమెత్తారు. ఇళ్లు మంజూరు కాకుండానే ప్రజల వద్ద డబ్బులు కట్టించుకొని వంచించారని మండిపడ్డారు. ఇళ్లు మంజూరు కానప్పుడు వాళ్ల డబ్బులు వాళ్లకు ఇచ్చేయాలి కదా అని ప్రశ్నించారు. 14,500 మంది దగ్గర డబ్బులు కట్టించుకొని 4 వేల ఇళ్లు ప్రారంభిస్తారా... అలాంటప్పుడు అంతమంది దగ్గర ఎందుకు డబ్బులు కట్టించుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.75 వేలు వసూలు చేశారని, ఆ విధంగా ఒక్క ఒంగోలు నగరంలోనే రూ.16 కోట్లు కట్టించుకొని నిలువునా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అసలు ఆ డబ్బులు ఏం చేశారో చెప్పాలని జనార్దన్‌ను నిలదీశారు. యరజర్ల వద్ద 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇద్దామని అన్నీ సిద్ధం చేస్తే కోర్టుకు వెళ్లి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వనీయకుండా ఆపారన్నారు. అందుకే రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి, ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశామని బాలినేని పేర్కొన్నారు. గడ్డికయ్యలు మెయిన్ రోడ్డులో రూ.55.95 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్‌లు, సిమెంటు రోడ్డును బాలినేని ప్రారంభించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, మహిళా విభాగం జిల్లా పార్టీ అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, నాగం శేషయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ధామరాజు క్రాంతికుమార్, పలుపులేటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు, బొమ్మినేని మురళి, తూము పద్మ, గోలి తిరుపతి రావు, నక్కల లీలా కుమారి, మీరావలి, జే.పున్నయ్య, బి.మరియమ్మ, వెంకటరత్నం, ఇడుగు ఇందిర, మేరమ్మ, డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ రెడ్డి, తాళ్లపాలెం శ్రీను, జమ్ము శ్రీకాంత్, వాకా తిరుమల, పి.మోహన్ రావు, బొట్ల సుబ్బారావు, ఆసోది విజయలక్ష్మి, విక్కీ వెంకటేశ్వర్లు, ఎస్‌కే.ఖుద్దూస్, గఫూర్ సాహెబ్, కేటీ.శ్రీను, పి.మోహన్ రావు, రామిశెట్టి హరి, ఆవుల సురేంద్ర, గొల్లపోలు కృష్ణ, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెంట్రింగ్ కార్మికుని మృతి


కాటంరాజు

మార్కాపురం: సెంట్రింగ్ పనిచేస్తూ ప్రమాద వశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. దొనకొండ మండలం మల్లంపేటకు చెందిన మేకనబోయిన కాటంరాజు (22) సెంట్రింగ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి జారిపడ్డాడు. తీవ్ర గాయాలు కావటంతో వెంటనే వైద్యశాల తరలించారు. మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఫాం-ఎఫ్ అప్‌లోడ్ చేయాలి

- స్కానింగ్ సెంటర్లకు డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి ఆదేశం

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ స్కానింగ్ సెంటర్లు స్కాన్ చేసిన గర్భిణీ వివరాలను ఫాం-ఎఫ్‌లో నింపి ప్రతి నెలా 5వ తేదీలోపు పీసీ అండ్ పీఎస్‌డీటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి సూచించారు. ఆ మేరకు అన్ని స్కానింగ్ సెంటర్లకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాలు అప్‌లోడ్ చేయని స్కానింగ్ సెంటర్లపై భ్రూణ హత్యల నివారణ, లింగ నిర్ధారణ నిషేధ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఆయా సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆ మేరకు జిల్లాలో ఉన్న 33 ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు, 14 ప్రభుత్వ స్కానింగ్ సెంటర్లకు షోకాజ్ నోటీసులు అందజేశారు. షోకాజ్ నోటీసులకు నిర్దేశించిన సమయంలో సమాధానం ఇవ్వాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి తెలిపారు.

మా ప్రతి గుండెలోనూ వైఎస్సార్

- సీఎం వైఎస్ జగన్ మైనార్టీలను అక్కున చేర్చుకున్నారు
- మేమంతా జగనన్నకు తోడుగా ఉన్నాం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా


'హర్ దిల్ మే వైఎస్సార్..హమ్ సబ్ జగన్ కే సాథ్' అనే బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా, జిల్లా అధ్యక్షుడు జలీల్, నాయకులు

ఒంగోలు సబర్బన్: ప్రతి మైనార్టీ గుండెలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కొలువై ఉన్నారని, ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించి ఆదుకున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన.. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ చేసిన సేవలు, ప్రస్తుతం ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న సేవల గురించి వివరించారు. మైనార్టీలన్నా.. మైనార్టీల సంక్షేమం అన్నా గుర్తుకొచ్చేది దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. ముస్లింలకు ఏకంగా 4 శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత వైఎస్సార్‌కే చెందుతుందని కొనియాడారు. ఆయన తర్వాత ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే ముస్లింలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదుకుంటున్నారన్నారు. గడిచిన నాలుగేళ్లలో 34,17,199 మంది ముస్లిం లబ్ధిదారులకు నేరుగా డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో రూ.11,896 కోట్లు జమ చేశారని వెల్లడించారు. జగనన్న అమ్మ ఒడి కింద 3.06 లక్షల మంది తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున అందిస్తున్నారన్నారు. జగనన్న విద్యాదీవెన కింద 1.83 లక్షల మంది, జగనన్న వసతి దీవెనలో భాగంగా 1.99 లక్షల మంది విద్యార్థులు లబ్ధిపొందారన్నారు. వైఎస్సార్ చేయూత ద్వారా 45 సంవత్సరాలు పైబడిన 2.20 లక్షల మంది, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా 4.44 లక్షల మంది స్వయం సహాయక గ్రూపుల ముస్లిం మహిళలు లబ్ధిపొందారని తెలిపారు. సొంతింటి కల నెరవేరుస్తూ 1.29 లక్షల పేద ముస్లింలకు ఇళ్లు కట్టిస్తున్నారన్నారు. మైనార్టీల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌డీ జలీల్ మాట్లాడుతూ ప్రతి ముస్లిం తన జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలనుకుంటాడని, అందుకుగానూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2022-23 సంవత్సరంలో రూ.5.52 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. అదేవిధంగా హజ్ యాత్ర చేపట్టే ముస్లింలు ఒక్కొక్కరిపై విమాన టికెట్ రూ.80 వేల అదనపు భారం పడకుండా 1813 మంది వెళ్లేందుకు రూ.14.51 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. ఆ మొత్తం భారాన్ని ప్రభుత్వమే భరించే విధంగా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుని ఆదుకున్నారన్నారు. ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు, మౌజమ్‌ల గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచి ఆయా కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చి ఆదుకున్నారన్నారు. అదేవిధంగా కోవిడ్ సమయంలో జగనన్న ప్రభుత్వం 8.1 లక్షల మందికి రూ.81 కోట్ల సాయం చేసి ఆదుకుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో 'హర్ దిల్ మే వైఎస్సార్..హమ్ సబ్ జగన్ కే సాథ్' అనే బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ ఇంతియాజ్, ఎస్‌డీ అజీజ్, ఏఎంసీ డైరెక్టర్ నియామతుల్లా, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నగర నాయకులు ఎస్‌కే మీరావలి, జిలానీ, చానస్, ఒంగోలు బుజ్జి, జుబేర్, హయాత్, జాన్ సైదా, అబ్దుల్లా, జానీ, నిస్సార్, జీలు, కుద్దూస్, 2వ డివిజన్ అధ్యక్షుడు నాయక్, 3వ డివిజన్ అధ్యక్షుడు జాఫర్, కాలేషా, సైదా, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యా నైపుణ్యాలకు పెద్ద పీట

- బ్రిలియంట్ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభంలో బాలినేని


మెగా ఫేర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: సాంకేతిక విద్యానైపుణ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఏ1 ఫంక్షన్ హాలులో జరిగిన బ్రిలియంట్ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను శనివారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ ల్యాబ్, ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం, ఖరీదైన ల్యాప్‌ట్యాప్‌లు సమకూర్చడం ద్వారా రేపటి పౌరులుగా ఉన్నతంగా ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సుల్లో అన్ని ఉత్తమమైనవేనని, అయితే ప్రస్తుతం అవకాశాలు మెండుగా ఉన్న రంగాన్ని ఎంచుకోవడమే విద్యార్థి ముందు ఉన్న తొలి సవాల్ అన్నారు. రిటైర్డ్ డీజీపీ కేఆర్‌ఎం కిషోర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా చదవాలన్నారు. అనంతరం వేదికపై భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి వెబ్ కౌన్సెలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాలేజీలు, కోర్సుల ఎంపిక వంటి వాటిపై బ్రిలియంట్ సంస్థ ప్రతినిధులు వివరించారు.

వివిధ రాష్ట్రాల నుంచి, వివిధ యూనివర్శిటీలు, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలనుంచి వచ్చిన వైస్ చాన్సిలర్లు, ప్రొఫెసర్లు, చైర్మన్లు, ప్రిన్సిపాల్స్ పలు సూచనలు చేశారు. ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కాలేజీ, మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ, ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీ, శ్రీహర్షిణీ డిగ్రీ కాలేజీ, శ్రీనాగార్జున డిగ్రీ కాలేజీ, శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ, హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ, ఫార్మసీ కాలేజీలతోపాటు పలు యూనివర్శిటీల ప్రతినిధులు తమ స్టాల్స్‌ను ఏర్పాటుచేసి విద్యార్థులకు అవసరమైన సమాచారాన్ని అందించారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ సంస్థ అధినేత షేక్ న్యామతుల్లాభాషా మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు విద్యారుణాల గురించి వివరించారు. అనంతరం లక్కీడీప్‌లో ఇద్దరిని ఎంపికచేసి ఒక్కొక్కరికి రూ. 40వేల విలువైన రెండు ల్యాప్‌ట్యాప్‌ను అందించారు. బ్రిలియంట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ తాహూర, శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నైనాల రామకృష్ణ, విద్యావేత్త పీహెచ్‌డీ కృష్ణంరాజు, బ్రిలియంట్ కోర్సు కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు షేక్ ఖలీఫాతుల్లా బాషా, డైరెక్టర్ అఖిల్, ఈవెంట్ మేనేజర్ నాగార్జున పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు


మట్టి నమూనాల సేకరణను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు, ఏడీఏ, ఏవో

మద్దిపాడు: రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఏడుగుండ్లపాడు రెవెన్యూ పరిధిలో వెంకట్రాజుపాలెం పొలాల్లో శనివారం నిర్వహించిన మట్టి నమూనాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ పంటల్లో సూక్ష్మపోషకాల లోపం అధికంగా కనిపిస్తోందన్నారు. దీనివలన రైతులకు ఆశించిన మేర దిగుబడులు రావడం లేదన్నారు. రసాయనిక ఎరువులు అధికంగా వాడటం వలన ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకుని అధిక దిగుబడి సాధించే దిశగా రైతులను ప్రోత్సహించాలని వీఏఏలకు సూచించారు. భూసార పరీక్షల్లో స్థూల పోషకాల విశ్లేషణతో పాటు వ్యవసాయ శాఖ ఐదు సూక్ష్మ పోషకాల విశ్లేషణ ఫలితాలను సాయిల్ హెల్త్ కార్డు ద్వారా రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పొలాల్లో మట్టి నమూనాలను వీఏఏలు సేకరించాలని చెప్పారు. ఒంగోలు భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ సుచరిత మాట్లాడుతూ రైతులు సేకరించిన మట్టిని నాలుగు సమభాగాలుగా చేసి అరకేజీ మట్టిని ఒంగోలు భూసార పరీక్ష కేంద్రానికి పంపితే ల్యాబ్‌లో జింకు, ఇనుము, బోరాన్, కాపర్, మాంగనీసు పోషకాల విశ్లేషణ జరిపి లోపాలను సవరించే మార్గాలను కార్డు ద్వారా అందిస్తామని తెలిపారు. అదే విధంగా పెదకొత్తపల్లి గ్రామంలో పీఎం కిసాన్ ఈకేవైసీలు వీఏఏలు ఏ విధంగా చేస్తున్నారో జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీలు త్వరగా చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ బి.రమేష్, మద్దిపాడు ఏఓ కె.రమేష్, ఏఈవో పి.శేషయ్య, వీఏఏలు కోటి, ప్రసన్న, అవినాష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎస్సై పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజేష్‌కుమార్

బేస్తవారిపేట: ఎస్సై పేరుతో ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడిని మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కంభం సీఐ ఎం.రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా పసర్లపాడుకు చెందిన వంకాడవత్ రాజేంద్రనాయక్ వ్యసనాలకు బానిసై ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నాడు. గూగుల్‌లో యూనిఫాంలో ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్ ఫొటోలు డౌన్‌లోడ్ చేసుకుని వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టుకుంటాడు. గూగుల్‌లోనే ఇంటర్నెట్ షాపుల వివరాలు సేకరిస్తాడు. నేమ్ బోర్డులపై ఉన్న ఫోన్ నంబర్లకు ఫోన్‌చేసి.. 'ఎస్సైని మాట్లాడుతున్నాను. మా అమ్మాయికి ఫీజు చెల్లించాలి. అర్జెంటుగా నగదు ట్రాన్స్‌ఫర్ చెయ్యి. నేను వచ్చి ఇస్తా'.. అంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 13వ తేదీ బేస్తవారిపేట ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు పీ సద్దాం హుస్సేన్‌కు ఫోన్ చేసి ఫోన్‌పే ద్వారా రూ.50 వేలు నగదు బదిలీ చేయించుకున్నాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీనిపై సద్దాం హుస్సేన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటికే రాజేంద్రనాయక్‌పై తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో పలు కేసులు నమోదై ఉన్నాయి. శనివారం అతన్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రజలు, దుకాణదారులు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ధ్రువీకరణ లేకుండా ఎవరికీ నగదు బదిలీ చేయవద్దని సీఐ కోరారు. కార్యక్రమంలో ఎస్సై మాధవరావు పాల్గొన్నారు.

చెక్ డ్యాంలో పడి బాలిక మృతి


ప్రమాదంలో మృతి చెందిన సాక్షి అక్షయ

టంగుటూరు: మూసి చెక్ డ్యాంలో ఇద్దరు బాలికలు ప్రమాదవశాత్తు పడిపోగా.. ఓ బాలిక మృతి చెందింది. మరో చిన్నారి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన అనంతవరం - తేటుపురం గ్రామాల మధ్య శనివారం చోటు చేసుకుంది. సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామానికి చెందిన పి. ప్రభాకర్ కుమార్తె సాక్షి అక్షయ (14) అదే గ్రామానికి చెందిన బంధువు డాకా అజయ్‌బాబుతో పాటు అతని కుమార్తె హర్షిత అంతా కలిసి ఒంగోలులో నివసిస్తున్నారు. కాగా అజయ్‌బాబు కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామంలో చికెన్ దుకాణం, చేపల చెరువులను సాగు చేస్తున్నాడు. అజయ్‌బాబు.. హర్షిత, (12) సాక్షి అక్షయలు ముగ్గురూ కలిసి వేసవి సెలవులు కావటంతో ఈతముక్కల గ్రామానికి వచ్చారు. అనంతరం చెరువులకు విద్యుత్ మరమ్మతులు చేయాల్సి ఉండగా అజయ్‌బాబు, సుబ్రహ్మణ్యం ద్విచక్ర వాహనంపై చేపల చెరువులు వెళ్లారు. కాగా చేపల చెరువుల వద్ద ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ కాళ్లకు బురద కావడంతో సమీపంలోని మూసి వాగులోని చెక్ డ్యాంలో వద్దకు వెళ్లి, ప్రమాద వశాత్తు కాలు జారి ఇద్దరూ వాగులో పడ్డారు. విషయం గమనించిన సుబ్రహ్మణ్యం వాగు వద్దకు చేరుకొని రక్షించేందుకు విఫల యత్నం చేసి అక్కడే చేపలు పట్టే వారిని సహాయం కోరాడు. వారు హర్షితను బయటకు తీసి, ఒంగోలు లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సాక్షి అక్షయ నీటిలో మునిగిపోయిన అనంతరం, మృతదేహం పైకి తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

అత్త దాడిలో అల్లుడి మృతి

ఒంగోలు టౌన్: మద్యం సేవించి వచ్చిన అల్లుడిపై ఆగ్రహానికి గురైన అత్త దాడి చేయడంతో చికిత్స పొందుతూ అల్లుడు శనివారం మృతి చెందాడు. మృతికి ముందు బాధితుడు రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు.. మద్దిపాడు మండలం గుళ్లపల్లి గ్రామానికి చెందిన సాదినేని రంగారావు (48) గత 4 ఏళ్లుగా ఒంగోలు నగరంలోని సుజాత నగర్ 9వ లైనులో భార్యాపిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. భార్య సుజాత ఒక టీవీ షోరూంలో పని చేస్తోంది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా మద్యానికి అలవాటు పడిన రంగారావు బుధవారం రాత్రి బీరు తాగి ఇంటికి వచ్చాడు. అత్త ఆదిలక్ష్మి అన్నం పెట్టగా తిని ఇంటి బయట మంచం వేసుకొని నిద్రపోయాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో మంచి నిద్రలో ఉన్న రంగారావుపై దాడి చేసి కొట్టింది. దెబ్బలకు తాళలేక ఇంట్లోకి పరిగెత్తిన రంగారావు మీద వేడిగా కాలుతున్న ద్రవాన్ని పోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో నిద్ర నుంచి మేలుకున్న సుజాత గాయపడిన భర్తను రిమ్స్ వైద్యశాలకు తరలించింది. గత రెండు రోజులుగా చికిత్స పొందుతున్న రంగారావు శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గేదెను ఢీకొన్న ద్విచక్రవాహనం.. వ్యక్తి మృతి

మర్రిపూడి: రాత్రి సమయంలో గేదెను ఢీకొనడంతో వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన మండలంలోని కూచిపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కనిగిరి మండలం ఏరువారిపల్లిపల్లె గ్రామానికి చెందిన రావూరి వెంకయ్య (30) తన అత్తగారి ఊరు అయిన తాళ్లూరుకు వెళ్లి తిరిగి సొంత గ్రామానికి శుక్రవారం రాత్రి ద్విచక్రవానంపై బయలు దేరారు. మండలంలోని కూచిపూడి శివారులోని పెట్రోల్‌బంక్ సమీపానికి రావడంతో చీకట్లో కనిపించని గేదెను ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో రావూరి వెంకయ్య రోడ్‌పై పడిపోవడంతో రక్త గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ పి. అంకమ్మరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.